క్లుప్తంగా

క్రికెట్ కిట్ అందజేత



అవనిగడ్డ: శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్‌నాయుడు తుంగపల్లెమ్మ క్రికెట్ జట్టుకు క్రికెట్ కిట్ అందించారు. స్థానిక డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో క్రికెట్ కిట్‌ను జట్టు నిర్వాహకులు గుండాబత్తిన మైథిల్, విస్సంశెట్టి గోపాల్‌కు శ్యాంకిశోర్ అందజేశారు. కార్యక్రమంలో డేగల రాఘవ, మోపిదేవి కోటేశ్వర రావు, అలపర్తి గోపీసాయి పాల్గొన్నారు.

కార్తికేయుని సన్నిధిలో భక్తజనకోలాహలం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధి ఆదివారం భక్తజన కోలాహలంగా మారింది. ఉదయం నుంచే ప్రధాన క్యూ భక్తులతో నిండింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పేదల గృహ నిర్మాణాలకు సిమెంట్ కట్టల పంపిణీ



బోడగుంట(మోపిదేవి): బోడగుంటలో నిర్మిస్తున్న గృహాలకు అవసరమైన సిమెంట్ కట్టలను వెంకటాపురం సీయోను గాస్పెల్ మినిస్ట్రీస్ ప్రార్థనా మందిరం నుంచి లబ్ధిదారులకు అందజేశారు. ఆదివారం 10 మంది లబ్ధిదారులు ఒక్కొక్కరికి 10 కట్టలు చొప్పున 10 గృహాలకు మొత్తం 100 సిమెంట్ కట్టలు, వెంకటాపురంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రార్థనా మందిరానికి మరో 25 కట్టలు మొత్తం 125 కట్టలను పంపిణీ చేసినట్లు విజయరాజు తెలిపారు. లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మినుము సాగు పరిశీలన



కె. కొత్తపాలెం(మోపిదేవి): మినుము సాగుపై సీతాఫలం తెగులు వ్యాపించినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. మండలంలోని కె. కొత్తపాలెంలో మినుము సాగు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మినుము సాగులో సీతాఫలం తెగులు వ్యాపించినట్లు, వీటి నివారణకు మందులు పిచికారి చేయాలని రైతులు సూచించారు. ఏఆర్‌సీ ఘంటసాల వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ లహరి మాట్లాడుతూ మినుములో ఎక్కువగా సీతాఫలం తెగులు ఉండటంతో రైతులు విత్తన శుద్ధి చేసిన తర్వాత తప్పనిసరిగా వాడాలని తెలిపారు. అవసరానికి మించి మందులు పిచికారీ చేయొద్దని రైతులకు సూచించారు. డీఆర్‌సీ డీడీఏ కె. జ్యోతి రమణి, ఏడీఏ కె. శ్రీనివాస రావు, ఏవో బి పద్మజ, అవనిగడ్డ ఏడీఏ జె.ఎస్. జయప్రద, మోపిదేవి ఏవో కె. మెప్సిబా రాణి, మండల వీఏఏ, వీహెచ్ఏ, పలువురు రైతులు పాల్గొన్నారు.

పెడన ఎస్ఐ సూర్యశ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



పెడన: పెడన ఎస్ఐగా టి.సూర్యశ్రీనివాస్ ఆదివారం సాయంత్రం బాధ్యతలను స్వీకరించారు. ఆయన ఆత్కూరు నుంచి బదిలీపై పెడన వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన రవి చంద్రకుమార్ ఉంగుటూరుకు బదిలీ అయిన విషయం విదితమే. ఆదివారం రవిచంద్ర కుమార్ నుంచి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం జరిగిన రవిచంద్రకుమార్ వీడ్కోలు సభలో స్టేషన్ సిబ్బందితో పాటు పట్టణ ప్రముఖులు పలువురు రవిని ఘనంగా సన్మానించారు. కొత్త ఎస్ఐ సూర్యశ్రీనివాస్‌ను అభినందించారు.

పుస్తకాల పంపిణీ

పామర్రు: మానవతా సంస్థ ప్రతినిధి పీఎంఎస్ ప్రసాద్, స్థానిక మానవతా కార్యాలయంలో దాతల సహకారంతో పేద విద్యార్థులకు ఆదివారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మానవత సేవాసంస్థ కోశాధికారి పీవీ శ్రీనివాస్ వితరణతో నోట్ పుస్తకాలను అందజేశామని తెలిపారు. సేవా సంస్థ కార్యదర్శి నారాయణ, ప్రతినిధులు ఎస్. త్రివిక్రమరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలు సిద్ధం

- రూ. 69.36 కోట్లతో ఇళ్లు
- రూ. 15.82 కోట్లతో మౌలిక వసతులు
- ఇప్పటికే లబ్ధిదారులు గృహ పరిశీలన
- త్వరలోనే గృహప్రవేశాలు



మచిలీపట్నంలో ప్రారంభానికి సిద్ధమైన టిడ్కో గృహాలు

మచిలీపట్నంటౌన్: నగరంలో టిడ్కో ఇళ్లు సిద్ధమయ్యాయి. గత టీడీపీ పాలకులు జీ ప్లస్ త్రీ ఇళ్ల నిర్మాణాలను నిర్లక్ష్యం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ప్రత్యేక చొరవతో మచిలీపట్నంలోని 32వ డివిజన్ గోసంఘం వద్ద టిడ్కో గృహ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 18 బ్లాక్‌లలో 864 గృహాలు పంపిణీకి సిద్ధమయ్యాయి. రూ. 69.36 కోట్లతో జీ+3 ఇళ్లను నిర్మించారు. వీటిలో 300 చదరపు అడుగులు ఉన్న గృహాలు 192, 430 చదరపు అడుగులు ఉన్న 672 గృహాలను సిద్ధం చేసి పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించారు. త్వరలో ఈ గృహాలను లబ్ధిదారులకు అందజేయడానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. నిర్మాణాలు పూర్తైన వాటిని ఇటీవల లబ్ధిదారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పేర్ని నాని.. ఆ ఇళ్లలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయని లబ్ధిదారులు చెబితే వాటిని తక్షణం పరిష్కరించడానికి చర్యలు తీసుకున్నారు.

రూ. 15.82 కోట్లతో మౌలిక వసతులు

గో సంఘం సమీపంలో టిడ్కో గృహాల వద్ద రూ. 15.82 కోట్లతో మౌలిక వసతుల కల్పన చేశారు. అంతర్గత సిమెంటు రోడ్లు, పైప్‌లైన్లు, డ్రైన్లు, రిజర్వాయర్లు, ఓవర్‌హెడ్ ట్యాంక్, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు పూర్తి చేశారు. గృహసముదాయాలకు ప్రత్యేకంగా విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించారు. రూ. 2.60 కోట్లతో సివిలేజ్ ట్రీట్‌మెంట్ బ్లాక్ (ఎస్‌డీబీ) నిర్మించారు. దీంతో గృహాల్లో వ్యర్థ నీటిని శుద్ధి చేసి మళ్లీ వినియోగించుకునేలా చేయనున్నారు.

టీడీపీ హయాంలో అసంపూర్తిగా..

2019 అసెంబ్లీ ఎన్నికలకు ముందు నాటి టీడీపీ ప్రభుత్వం భవన ఆకారాలను చూపించి అందరికీ జీ+3 గృహాలు ఇస్తామని ప్రజలను మోసగించారు. కొన్ని బ్లాక్‌లను మౌలిక వసతులు లేకుండా నిర్మించి లాటరీలు కూడా తీశారు. వాస్తవానికి నాడు 50 శాతంలోపే పనులు జరిగాయి. గోసంఘం వద్ద 18 బ్లాక్‌లు నిర్మించాల్సి ఉండగా 14 బ్లాక్‌లు అసంపూర్తిగా నిర్మించారు. తాగునీరు, రోడ్లు, విద్యుత్ వైరింగ్, ఫ్లోరింగ్, ఇంటీరియర్ పనులు చేపట్టలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే పేర్ని నాని కృషితో మరో నాలుగు బ్లాక్‌ల పనులను చేపట్టారు.

గృహాలు ఎంతో బాగున్నాయి



జీ+3 టిడ్కో గృహాల్లో నాకు సీ–2 బ్లాక్‌లో ఫ్లాటు వచ్చింది. దాన్ని పరిశీలించాను. అధునాతన హంగులతో అభివృద్ధి చేశారు. ఫ్లాట్‌లో అన్ని వసతులూ ఉన్నాయి. గత ప్రభుత్వంలో రూ. 25 వేలు చెల్లించాను. అప్పుడు నిర్మాణం జరగకపోవడంతో నాకు ఫ్లాట్ అప్పగించలేదు.

–డీకొల్లు శేషారత్నం, లబ్ధిదారు

జగనన్న కారణంగానే సొంతిల్లు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతోనే జీ+3 గృహాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. గత టీడీపీ నాయకులు అసంపూర్తిగా వదిలేయగా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి మా ఆశలు నెరవేర్చారు. జగనన్నే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నాను.

– సురగని లక్ష్మి, లబ్ధిదారు

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



సత్యసాయి మందిరంలో తండులార్చనలో విద్యార్థులు

మచిలీపట్నంటౌన్: స్థానిక ఈడేపల్లిలోని శ్రీ సత్య సాయిబాబా మందిరంలో ఆదివారం శ్రీ సత్య సాయి విద్యా విభాగం ఆధ్వర్యాన శ్రీ సత్యసాయి గాయత్రీ తండులార్చన పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశ్వశాంతి కోరుతూ విద్యార్థినీ, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలని, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని కోరుతూ పూజలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సమితి ఆధ్యాత్మిక సహసమన్వయకర్త, శ్రీ సమయ మంతుల వెంకట చెన్నయ్యగుప్తా తెలియజేశారు. తొలుత ఎం.కొండలరావు, గంగా భవాని దంపతులు, సింధుజ, విశాలి, సాయి గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. వేదాధ్యయన విభాగ బ్రహ్మశ్రీ పాతూరి జ్ఞానేశ్వరి శర్మ, వేదక్తంగా గాయత్రీ మాతకు పూజలు చేశారు. అనంతరం సమితి కన్వీనర్ పోతుకుచి ఆంజనేయ కుమార్ మాట్లాడుతూ పిల్లలు సకాలంలో ఆహారాన్ని తీసుకునేలా చూడాలని కోరుతూ తండులార్చన నిర్వహించినట్లు తెలిపారు. గుడివాడ సత్యసాయి సేవాసమితి కన్వీనర్ రవికుమార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 18 ఆదివారం గుడివాడలో శ్రీ సత్య సాయి శత రుద్రయం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమితి ఆధ్యాత్మిక సమన్వయకర్తలు వై.సాయి బాబు, తుర్లపాటి గిరీష్ బాబు, వై.మణి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో గురువులు, తల్లిదండ్రులు భక్తులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సత్కారం



అవనిగడ్డ: నరసాపురం ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లిన తహసీల్దార్ ఎల్వీఎన్ రామకృష్ణను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు సన్మానించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం రామకృష్ణకు వీడ్కోలు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ తహసీల్దార్ రామకృష్ణ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంపీడీవో మరియాదేవి, ఎస్ఐ రమేష్, హౌసింగ్ ఏఈ సురేంద్ర, పార్టీ యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి గాజుల జయగోపాల్, రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐలుగా ఎంపికైన ఇద్దరికి సన్మానం



అవనిగడ్డ: ఎస్ఐలుగా ఎంపికైన ఇద్దరిని ఘనంగా సత్కరించారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం పలు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల ఎస్సైలుగా ఎంపికైన మందపాకలకు చెందిన బండికోళ్ల జయరాజు, మోపిదేవికి చెందిన జి.నవీన్‌ని పోస్టుమాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావు, గ్రంథాలయ అధికారులు జె.ప్రభుదాస్, శ్రీదేవి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎస్సై పరీక్షలకు పోటీపడిన తీరుని జయరాజు, నవీన్ అభ్యర్థులకు వివరించారు. సింహాద్రి రామలింగేశ్వరరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్రం అధ్యాపకురాలు వీరకుమారి పోటీ పరీక్షలకు పలు అంశాలను వివరించారు.

భార్యాపిల్లలు అదృశ్యంపై కేసు

పెనమలూరు: పోరంకిలో భార్య, ఇద్దరు పిల్లలు అదృశ్యమైన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి జంగాల బజార్‌లో ఎస్.సత్యనారాయణ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అయితే ఈ నెల 2వ తేదీన తన తండ్రి అమృతలింగాన్ని చూసే విషయంలో తల్లి సముద్రదేవి, భార్య లక్ష్మీప్రసన్నకు మధ్య గొడవ జరిగింది. దీంతో లక్ష్మీప్రసన్న అలిగి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో భర్త సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

మరో ఘటనలో..

భార్య అదృశ్యంపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చత్తీస్‌గఢ్ కు చెందిన నిసాద్ అనీల్‌కుమార్ తన భార్య రాజ్‌కుమారితో కలిసి పోరంకిలో ఉంటూ ఇరువురూ తాపీ పనులు చేస్తున్నారు. కాగా గత నెల 29వ తేదీన భర్త అనీల్‌కుమార్ పనికి వెళ్లగా భార్య ఇంట్లోనే ఉంది. భర్త పనులు ముగించుకొని ఇంటికి రాగా ఇంటికి తాళం వేసి ఉంది. భార్య కోసం వాకబు చేసినా ఆమె ఆచూకీ తెలియలేదు. ఆమె ఫోన్ స్విచ్చాఫ్ రావటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేశారు.

హెచ్ఐవీ బాధితులపై వివక్ష వద్దు

ముదినేపల్లి రూరల్: హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపకుండా మంచి మనసుతో వారిని ఆదరించాలని గురజ పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ స్వాతి అన్నారు. చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో మండలంలోని గురజలో ఎయిడ్స్‌పై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ స్వాతి మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులు సక్రమంగా మందులు వాడుతూ జీవితకాలాన్ని పెంచుకోవచ్చన్నారు. లింక్ వర్కర్స్ స్కీమ్ సూపర్‌వైజర్ బి.రాకేష్, సర్పంచ్ జంగం వెంకటేశ్వరరావు, వీఆర్వో హనుమంతరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, లింక్ వర్కర్స్ జె.చంద్రావతి, సీహెచ్. నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం – చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు ఆదివారం విరాళాలు అందించారు. గుడివాడకు చెందిన వేముల నాగసాయి బాలాజీ, లక్ష్మి దంపతులు అంతరాలయ ముఖ ద్వారానికి వెండితాపడం చేసే నిమిత్తం రూ.10,116, అదేవిధంగా గుడివాడకు చెందిన వేముల మణీశ్వర్ రూ.10,116 విరాళాన్ని ఆలయ కార్యాలయంలో సహాయ కమిషనర్ నేల సంధ్యకు అందజేశారు.

గ్రంథాలయ భవనం మార్పునకు సహకరించండి



గుడివాడ టౌన్: స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయం స్థానంలో కొత్త భవనం నిర్మాణం చేపడుతున్నట్లు కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ టి. జమలపూర్ణమ్మ అన్నారు. ఆదివారం ఆమె గ్రంథాలయంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవనం శిథిలావస్థకు చేరుకుందని, దీనిని తక్షణమే తొలగించి కొత్త భవనం నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. తిరిగి భవనం నిర్మించే వరకు అద్దె భవనంలో గ్రంథాలయం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఖాళీగా ఉన్న భవనాలు గ్రంథాలయ సేవలకు అందజేయాలని కోరారు. గ్రంథాలయ అధికారి బీరం వెంకటరమణ, సిబ్బంది ప్రవల్లిక, రవిచంద్ర పాల్గొన్నారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయ క్యూలో ఆదివారం భక్తులు బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

నేడు వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

కోడూరు: నరసింహపురం గ్రామ సమీపంలో లింగన్నకోడు డ్రైన్‌పై వంతెన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేయనున్నట్లు డ్రైనేజీ ఏఈ కరీమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఉన్న వంతెన ఇటీవల కూలిపోవడంతో వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఉదయం 9గంటలకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని అధికారులు పాల్గొనాలని కోరారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

నాగాయలంక: నాలుగో విడత ఆసరా పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం నాగాయలంకలో లబ్ధిదారులకు అందిస్తున్నట్లు మండల వెలుగు ఏపీఎం కె.వై.దాసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేమాలవారిపాలెంలోని నాగాయలంక మార్కెట్ యార్డులో ఉదయం 10 గంటలకు జరిగే సభలో ముఖ్యఅతిథిగా హాజరయ్యే అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చేతులమీదుగా మండలంలోని 1121ఎస్‌హెజీ గ్రూపులకు చెందిన 12,020మంది సభ్యులకు రూ.9,62,21,205 మొత్తానికి చెక్కులు అందిస్తామని పేర్కొన్నారు. వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు, సంబంధిత అధికారులు కార్యక్రమంలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

కలసి అడుగులేద్దాం.. జగన్‌ను మళ్లీ సీఎం చేద్దాం

వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము



నడుపూరులోని స్థానిక నాయకులతో మాట్లాడుతున్న పెడన ఇన్‌చార్జి రాము

పెడన: వైఎస్సార్ సీపీ కుటుంబ శ్రేణులు కలసి ముందుకు అడుగులు వేద్దామని, జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పని చేద్దామని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన నడుపూరు, మెరికేపాలెం గ్రామాల్లోని ముఖ్యనాయకులను కలిసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని ఆకాంక్షించారు. అందరం కలిసికట్టుగా పని చేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేద్దామని పిలుపునిచ్చారు. నడుపూరులో మాజీ సర్పంచు రాజనాల గౌతమ్, వైఎస్సార్ సీపీ నాయకుడు చీర్ల కృష్ణ, నాని తదితరులను కలిశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆత్మూరి శ్రీమన్నారాయణను మర్యాదపూర్వకంగా కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. రాముతో పాటు పార్టీ నాయకులు రాజులపాటి అచ్యుతరావు, గరికపాటి వెంకటరామానాయుడు, బళ్ల గంగయ్య, యాదంరెడ్డి వరప్రసాద్, బెజవాడ నాగబాబు, మతీన్‌ఖాన్, లోయ అంజనేయులు, సింగంశెట్టి రాంబాబు, అశోక్ తదితరులున్నారు.

205 మందికి ఉచిత వైద్యసేవలు



నేత్ర పరీక్షలు చేస్తున్న డాక్టర్లు, చిత్రంలో సంస్థ ప్రతినిధులు, సేవా కార్యకర్తలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని బుట్టాయిపేటలో ఉన్న జ్యోతీరావుపూలే విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ గోపాలం శివన్నారాయణ వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన శిబిరంలో 205 మందికి వైద్యసేవలు అందించారు. అనంతరం రెండు నెలలకు సరిపడా మందులను ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, డాక్టర్ కుప్పా రామశాస్త్రి, మెడికల్ క్యాంపు కన్వీనర్ పామర్తి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

152 మందికి కంటి వైద్య పరీక్షలు

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి(పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యాన ఆదివారం 37వ ఉచిత కంటి వైద్యశిబిరం జరిగింది. మండ సీతారామయ్య చారిటబుల్ ట్రస్టు(మర్రిపాలెం)చైర్మన్ మండ వెంకటేశ్వరరావు సౌజన్యంతో స్థానిక మారుతీ విద్యానికేతన్ ప్రాంగణంలో నిర్వహించిన శిబిరాన్ని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. సంస్థ ప్రతినిధులు తలశిల రఘుశేఖర్, వెంకట నారాయణను అభినందించారు. శిబిరంలో 152మందికి పరీక్షలు చేయగా 127మందికి ఐఓఎల్ ఆపరేషన్ (కంటి లోపల అద్దం అమరిక)లకు ఎంపిక చేసి ఉచిత శస్త్ర చికిత్సలకు బస్సులో పెదకాకాని ఆసుపత్రికి పంపించినట్లు చెప్పారు. డాక్టర్ హిర్, డాక్టర్ చింతన్ రోగులకు నేత్ర పరీక్షలు చేశారు. ఉపసర్పంచి తలశిల నాని, రెడ్‌క్రాస్ చైర్మన్ శివవిష్ణువర్ధన్, అశ్విన్, ఆసుపత్రి క్యాంప్ ఇన్‌చార్జి నాగబాబు, జమీలా మస్తాన్ పాల్గొన్నారు.

గూడూరు పీఏసీఎస్ చైర్మన్‌గా కారుమంచి



కామేశ్వరరావును అభినందిస్తున్న మంత్రి జోగి రమేష్

గూడూరు: గూడూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా కారుమంచి కామేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 30తో పీఏసీఎస్ చైర్‌పర్సన్‌ల పదవీకాలం ముగిసింది. ఈ నేపథ్యంలో వారి పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిలో భాగంగా గూడూరు పీఏసీఎస్ చైర్మన్‌గా ఆకుమర్రుకు చెందిన కారుమంచి కామేశ్వరరావు నియమితులయ్యారు. పర్సన్లుగా వేము ఆనంద్, ఆకూరి శ్రీనివాసరావు కొనసాగనున్నారు. చైర్మన్‌గా నియమితులైన కామేశ్వరరావు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను కలిసి తన నియామకానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, కేడీసీసీబీ డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, పార్టీ అధ్యక్షుడు పర్లం పెదబాబు తదితరులు కామేశ్వరరావును అభినందించారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



కానూరులో ర్యాలీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పెనమలూరు: క్యాన్సర్ వ్యాధి నివారణకు ప్రజల్లో అవగాహన పెంపునకు ఆదివారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు కానూరు 100 అడుగల రోడ్డు వరకు ర్యాలీ చేశారు. ప్రతి ఒక్కరూ శరీరంలో వచ్చే మార్పులు గమనించాలన్నారు. సరైన ఆహారం తీసుకొని ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని సూచించారు. ప్రతి రోజూ వ్యాయామం చేయాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

పన్నుల విధింపుపై ప్రత్యేక డ్రైవ్

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పన్నుల విధింపు పై ప్రత్యేక చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన ఆదివారం ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కానూరు, యనమలకుదురు, తాడిగడప, పోరంకి ప్రాంతాల్లో ఇంటి పన్నులు లేని వారు, ఖాళీ స్థలాలకు పన్నులు వేయించుకోని వారు వెంటనే పన్నులు వేయించుకోవాలని సూచించారు. ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ అడ్మిన్లు, వలంటీర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ నెల 12వ తేదీన పన్నుల విధింపుపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. పన్నుల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం చూపొద్దని హెచ్చరించారు.

రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోవాలి

పెనమలూరు: రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోవాలని పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు అన్నారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ రామారావు మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో ఉంటే షీట్లు తొలగిస్తామన్నారు. త్వరలో ఎన్నికలు జరుగుతున్నందున రౌడీషీటర్లు క్రమశిక్షణతో మెలగాలన్నారు. రౌడీషీటర్లు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంటుందని తెలిపారు.